తరుగు పేరిట దోపిడీ..

- రైతులను దోచుకుంటున్న మహారాష్ట్ర వ్యాపారులు
- తరుగుతో నష్టపోతున్న కంది, మినుము రైతులు
- క్వింటాలుకు నాలుగు కిలోల కోత
- ఆదుకోవాలని అన్నదాతల విన్నపం

డోంగ్లీ, ఫిబ్రవరి 6: ఆరుగాలం శ్రమించి పంటను పండించిన రైతన్నకు పంట అమ్ముకొనే సమయంలోనూ కష్టాలు తప్పడం లేదు. వ్యాపారులు కుమ్మక్కై రైతులను దోచుకోవడం పరిపాటిగా మారుతున్నది. నీటి వసతి తక్కువగా ఉండడంతో డోంగ్లీ మండలంలోని రైతులు ఆరుతడి పంటలను పండిస్తారు. మండలంలోని డోంగ్లీ, లింబూర్, మొఘా, మారేపల్లి, మల్లాపూర్ గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు యాసంగిలో కంది, మినుము పంటలను సాగుచేశారు. మండలంలో రెండు వేల ఎకరాల్లో మినుము, 2,300 ఎకరాల్లో కంది పంట సాగు చేయగా.. ఇప్పుడిప్పుడే చేతికి వస్తున్నది. కష్టపడి పండించిన పంటకు ప్రస్తుతం ధర కూడా బాగానే ఉండడంతో రైతు సంతోషించాడు. కానీ వ్యాపారులు వారి ఆశలపై నీళ్లు చల్లుతున్నారు. దళారులు అంతా ఏకమై క్వింటాలుకు నాలుగు కిలోల చొప్పున తరుగు తీస్తున్నారు. ఈ విషయమై రైతులు డోంగ్లీ నాయబ్ తహసీల్దార్ రాచప్పకు మంగళవారం ఫిర్యాదు చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన రైతులు భరోసా ఇచ్చారు.

కందులు కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యాపారులు


నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు

దెగ్లూర్ నుంచి వ్యాపారులు..

మహారాష్ట్రలోని దెగ్లూర్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నారు. వారందరూ ఏకమై క్వింటాలుకు నాలుగు కిలోల తరుగు తీస్తున్నారు. ప్రస్తుతం కంది క్వింటాలుకు రూ.పది వేలు ధర పలుకుతున్నది. తరుగు విధించడంతో క్వింటాలుకు రూ.నాలుగు వందలు రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. కష్టపడి పండించిన పంటను దళారులు తరుగు పేరిట దోచుకోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

కిలో బదులు నాలుగు కిలోల తరుగు..

నిబంధనల మేరకు పప్పు దినుసులకు క్వింటా లుకు కిలో తరుగు తీయాలి. కానీ నాలుగు కిలోలు తీస్తున్నారు. నేను నాలుగు ఎకరాల్లో మినుము పంట వేశాను. 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. 80కిలోల కోత పెట్టారు. దీంతో నేను రూ.5,600 నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం దళారులపై చర్యలు తీసుకోవాలి.

\- పి.వీరన్న, రైతు, డోంగ్లీ

ఇష్టానుసారంగా కోతలు..

యాసంగిలో తేమ శాతం ఉండదు. కోత విధించాల్సిన పని కూడా లేదు. కానీ వ్యాపారులు ఏదో ఒక సాకు చెప్పి ఇష్టానుసారంగా కోతలు విధిస్తున్నారు. రైతులు నష్టపోక తప్పడం లేదు. వ్యాపారులతో అధికారులు మాట్లాడి కఠిన చర్యలు తీసుకోవాలి.

\- కె.పండరి, రైతు, డోంగ్లీ

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్

కామారెడ్డి, ఫిబ్రవరి 6 : జిల్లా కేంద్రంలో న్యాయవాది సింజిత్ గౌడ్‌పై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం కామారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ సింధూ శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అతిమాముల శ్రీధర్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కోశాధికారి సూర్యప్రసాద్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, సీనియర్ న్యాయవాదులు జగన్నాథం, రత్నాకర్ రావు, నరేందర్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, సిద్దిరాములు, భిక్షపతి, గంగాధర్, రాజు, రజినీకాంత్, భార్గవ్ న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 6: కామారెడ్డి పట్టణానికి చెందిన జూనియర్ న్యాయవాదిపై డీఎస్పీ చేసిన దాడిని ఖండిస్తూ జిల్లా బార్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు ఎల్లారెడ్డిలో న్యాయవాదులు మంగళవారం ఒకరోజు విధులను బహిష్కరించారు. ఎల్లారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీద్ పర్వేజ్ మాట్లాడుతూ.. కామారెడ్డిలో జూనియర్ న్యాయవాదిపై దాడిచేసి, న్యాయవాదుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినందుకు తాము విధులను బహిష్కరించామని అన్నారు. కార్యక్రమంలో నామ శ్రీకాంత్, గోపాల్‌రావు, పద్మ పండరి, నామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలను వెంటనే చెల్లించాలి

సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 6 : కార్మికుల మూడు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐసీటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు కోరారు. కార్మికుల వేతనాలను ఇప్పించాలని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెలో బాన్సువాడ దవాఖాన కార్మికులు పాల్గొనాలని, సమ్మె నోటీసును మెడికల్ సూపరింటెండెంట్‌కు అందజేశారు. కార్యక్రమంలో దవాఖాన కార్మికులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బస్వన్నపల్లిలో ఘనంగా ఎల్లమ్మ జాతర

రాజంపేట్, ఫిబ్రవరి 6 : మండలంలోని బస్వన్నపల్లిలో మంగళవారం ఎల్లమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. భక్తులు ఎల్లమ్మకు ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలంతా భక్తి శ్రద్ధలతో జాతరలో పాల్గొన్నారు.

మాలమహానాడు మండల కమిటీ ఎన్నిక

దోమకొండ, ఫిబ్రవరి 6 : మాలమహానాడు మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా పిప్పిరి రాములు, ఉపాధ్యక్షుడిగా బత్తిని వెంకటేశ్, కోశాధికారిగా సత్యనారాయణ, సలహాదారులుగా ప్రభాకర్, రాజు, ప్రశాంత్, వినోద్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మాలమహానాడు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మరో బాలుడి మృతదేహం లభ్యం

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 6 : బీర్కూర్ గ్రామ శివారులోని అంకుశ్ ఖాన్ చెరువులో సోమవారం ఇద్దరు యువకులు గల్లంతైన విషయం తెల్సిందే. సోమవారం రాత్రి గణేశ్(16) మృతదేహం లభించగా, మంగళవారం అభిజిత్ (15) మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెలికి తీశారు. ఏఎస్సై సీతారామరమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మపూర్ గ్రామానికి చెందిన గణేశ్, అభిజిత్ కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇంటి నుంచి బయటికి వెళ్లారు. మొదట అభిజిత్ చెరువులో పడిపోగా గణేశ్ కాపాడడానికి వెళ్లి నీటిలో మునిగి మృతి చెందినట్లు ఆమె తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృ తదేహాలను బాన్సువాడ దవాఖాకు తరలించినట్లు తెలిపారు.

చెరువులో మునిగి ఒకరు దుర్మరణం

గాంధారి, ఫిబ్రవరి 6: చెరువులో మునిగి ఒకరు మృతి చెందిన ఘటన గాంధారిలో చోటు చేసుకున్నది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారికి చెందిన గడ్డమీది మహేశ్ (30) సోమవారం పశువులను మేపడానికి కోనాయిపల్లి శివారుకు వెళ్లాడు. నీరు తాగించేందుకు చెరువులోకి బర్రెలను తీసుకెళ్లాడు. చెరువులోని బర్రెలను బయటికి తోలుతుం డగా.. గేదె మెడలో ఉన్న తాడు మహేశ్ కాళ్లకు చుట్టుకొని నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుడి భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఇంటర్మీడియెట్ అడ్మిషన్ గడువు పొడిగింపు

కామారెడ్డి, ఫిబ్రవరి 6 : తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల (ఆంగ్ల మాధ్యమం)లో 2024-25 ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్ గడువు ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఇంతియాజ్ అలీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈసీ, సీఈసీ, బైపీసీలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ కోసం 8978847884 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. tmreis.telagana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

చలో ఢిల్లీ కరపత్రాల ఆవిష్కరణ

కామారెడ్డి, ఫిబ్రవరి 6 : జిల్లా కేంద్రంలోని బీసీ కళాశాల వసతి గృహంలో నిర్వహించిన సమావేశంలో చలో ఢిల్లీ కరపత్రాలను బీసీ సంఘం నాయకుడు నీల నాగరాజ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 8వ తేదీన చలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి, 9న ఓబీసీ జాతీయ సభ ఉంటుందన్నారు.

ఇంటి పన్ను చెల్లించాలి

యాడారంలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న ఎంపీవో కృష్ణ, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణాగౌడ్

బీబీపేట్, ఫిబ్రవరి 6 : ఇంటి పన్ను చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎంపీవో కృష్ణ అన్నారు. మంగళవారం బీబీపేట్ మండలంలోని యాడారం గ్రామంలో ఎంపీవో కృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణాగౌడ్, గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎంపీవో కృష్ణ పరిశీలించారు. కార్యక్రమం లో గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 6: మున్సిపల్ సిబ్బంది పట్టణంలో మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ ఆస్తి పన్ను వసూలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రూ.25వేలు వసూలు చేసినట్లు కారోబార్ దేవీదాస్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు శ్రీకాంత్, స్వామి, రాజు, ప్రశాంత్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

మాచారెడ్డి, ఫిబ్రవరి 6 : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మాచారెడ్డి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటాచారి అన్నారు. మాచారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సముదాయ పాఠశాలల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీ దేవసంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో మంగళవారం ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ మనీషా తొమ్మిది మంది దివ్యాంగ విద్యార్థులతో వ్యాయామం చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యూరియాను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారిణి

ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి

నిజాంసాగర్, ఫిబ్రవరి 6: యూరియాను ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి భాగ్యలక్ష్మి దుకాణాల యజమానులను హెచ్చరించారు. నిజాంసాగర్, మహ్మద్ నగర్ మండలాల్లోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఎరువులకు సంబంధించిన క్రయ విక్రయాలు, స్టాక్ రిజిస్టర్లు, ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. ప్రస్తుతం జిల్లాలో యూరియా కొరత లేదన్నారు. జిల్లాలో 3.45 లక్షల ఎకరాల్లో వరితో పాటు ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారని చెప్పారు. ఇందుకోసం 40వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా 42.29 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నదన్నారు. రెండు లక్షల 110 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా.. లక్షా 88 వేల ఎకరాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు. ఆయన వెంట ఏవో అమర్‌ప్రసాద్, వ్యాపారులు జనార్దన్, భాను, కుమార్‌సేట్, వెంకన్నసేట్ తదితరులు ఉన్నారు.

పంటలను పరిశీలించిన ఏడీఏ

పొతంగల్ కలాన్‌లో జొన్నను పరిశీలిస్తున్న ఏడీఏ రత్న

గాంధారి, ఫిబ్రవరి 6: మండలంలోని గండివేట్, సీతాయిపల్లి గ్రామ శివారుల్లో రైతులు సాగుచేస్తున్న పంటలను ఎల్లారెడ్డి ఏడీఏ రత్న మంగళవారం పరిశీలించారు. మక్కజొన్నకు భాస్వరం లోపంతోపాటు కాండం తొలుచు పురుగు ఆశించినట్లు గుర్తించారు. నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆమె వెంట ఏవో నరేశ్, ఏఈవో షోయబ్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

అధికారులు సూచించిన మందులనే వాడాలి

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 6 : వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా వరి పంటలకు తెగుళ్లు వ్యాపిస్తున్నాయని, వ్యవసాయాధికా రులు సూచించిన మందులనే పిచికారీ చేయాలని ఏఈవో గోపాల్ రైతులకు సూచించారు. మండలంలోని కొయ్యగుట్ట శివారులో తెగుళ్లు సోకిన పంటలను ఆయన రైతులతో కలిసి మంగళవారం పరిశీలిం చారు. ఆయన వెంట రైతు విఠల్, రవి, కాశయ్య ఉన్నారు.

ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

శ్రీకాంత్(ఫైల్)

గాంధారి, ఫిబ్రవరి 6: మండల కేంద్రానికి చెందిన చీమల్‌వార్ శ్రీకాంత్ (29) ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని కామారెడ్డికి అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఎల్లారెడ్డిపేట్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న మహేశ్.. పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నాడన్నారు. మృతుడి భార్య మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

పాలకవర్గానికి వీడ్కోలు

నిజాంసాగర్/కామారెడ్డి రూరల్, ఫిబ్రవరి 6: నిజాంసాగర్ పంచాయతీ పాలకవర్గానికి మంగళవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేశారు. పాలకవర్గంతోపాటు కార్యదర్శి గంగారాం, కారోబార్ సాయిలును గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో సందీప్, లింగాగౌడ్, ఏశయ్య, ప్రవీణ్, బాబూసేట్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామ సర్పంచ్ రవితేజా గౌడ్ పాఠశాల అభివృద్ధికి సహకరించినందుకు మంగళవారం ప్రాథమికోన్నత పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ నర్సింహులు, ప్రధానోపాధ్యాయుడు శేఖర్, టీచర్ ఉమారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పోచారంలో ఉచిత వైద్య శిబిరం

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 6: మండలంలోని పోచారం గ్రామంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర, దంత పరీక్షలతోపాటు ఈసీజీ తదితర టెస్టులు చేశారు. అవసరం ఉన్న వారికి మందుల ను అందజేశామని రెడ్‌క్రాస్ సొసైటీ ఈసీ మెంబర్ సంజీవ్‌రెడ్డి తెలిపారు. తహసీల్దార్ దశరథ్, డాక్టర్ రోహిత్, డాక్టర్ గంగాసింగ్, విక్రం కుమార్, దస్తీరాం, వేణు, నందు తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి కోసం నమోదు చేయించుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 6: గృహజ్యోతి పథకం ద్వారా నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా పొందడానికి వివరాలను నమోదు చేయించుకోవాలని ట్రాన్స్‌కో డీఈఈ గణేశ్ సూచించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో కలిసి మంగళవారం పర్యటించారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారి వివరాలను ఆయన సిబ్బందితో నమోదు చేయించుకున్నారు. విద్యుత్ రీడింగ్ తీసుకోవడానికి ఇంటికి వచ్చే ఆపరేటర్‌కు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు చూపించి విద్యుత్ మీటర్ సర్వీస్ నంబరును అనుసంధానం చేయించుకోవాలని తెలిపారు. వివరాలను అప్‌లోడ్ చేయించుకున్న వారు మాత్రమే గృహజ్యోతి పథకానికి అర్హులని పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న హెడ్‌కానిస్టేబుల్

పిట్లం, ఫిబ్రవరి 6: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన నాగరాజు సెల్‌ఫోన్ మూడు క్రితం పోగొట్టుకున్నాడు. పూర్తి వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి, సెల్‌ఫోన్‌ను రికవరీ చేశారు. దానిని బాధితుడికి మంగళవారం అందజేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ సాయాగౌడ్ తెలిపారు. పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

మాట్లాడుతున్న బ్యాంకు అధికారి

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 6: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వనిధి సే సమృద్ధి పథకం ద్వారా రుణాలు పొందేందుకు అర్హులైన వీధి వ్యాపారులు దరఖాస్తు చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ అభిషేక్ సూచించారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో వీధి వ్యాపారులతో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదివరకు పొందిన రూ.20వేల రుణాన్ని సకాలంలో చెల్లించిన వారు రూ.50వేల రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలపై అవగాహన

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 6: మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షపై ఆ పాఠశాల ఉపాధ్యాయుడు అనిల్‌కుమార్ మంగళవారం అవగాహన కల్పించారు. పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ, గూడెం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులతో ఆయన మంగళవారం మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించే ప్రవేశ పరీక్ష కోసం ఈ నెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఫలితాలు మే 20వ తేదీన వెల్లడవుతాయని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను 9701194909సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

ఎంఈవోకు సమ్మె నోటీసు అందజేత

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 6: డిమాండ్ల సాధన కోసం ఈ నెల 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో తాము పాల్గొంటున్నామని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎంఈవో వెంకటేశానికి మంగళవారం సమ్మె నోటీసును అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు, కూలీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని వారు ఆరోపించారు. బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

పిట్లం/సదాశివనగర్, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన బక్క రాములు సోమవారం రాత్రి మృతిచెందాడు. బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన బొడ్డ రాజు, డాకూరి వెంకట్‌రెడ్డి, హనుమ గంగారాం కలిసి రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబా న్ని ఓదార్చారు. సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన చిన్నమల్లగారి బాల్‌రాజు(చెన్నారెడ్డి) అనే గ్రామ పంచాయతీ రిటైర్డ్ కార్మికుడు మంగళవారం మృతిచెందాడు. అతడి అంత్యక్రియల కోసం రూ.పది వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ బోల్లిపెల్లి రాములు అందజేశారు.

వాహనాల తనిఖీ

రామారెడ్డి, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని గొల్లపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఏఎస్సై సుభాషిణి, కానిస్టేబుళ్లు పవన్, మధు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టేలా అవగాహన

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 6 : బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర, బాలికల ఎన్ఎస్ఎస్ యూనిట్-1,2 ఆధ్వర్యంలో మండలంలోని నాగారం, కొల్లూరు గ్రామంలో ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం కొనసాగుతున్నది. మంగళవారం గ్రామంలో నీటి వృథాను అరికట్టడం, భూగర్భ జలాలు పెంపుపై చర్యలు తదితర వాటి గురించి వలంటీర్లు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గంగాధర్, అధ్యాపకులు పద్మ, శ్రీదేవి, స్వప్న, అనుపమ, శ్రీనివాస్‌రావు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ పేరెంట్‌కు ప్రశంసాపత్రం


ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంఈవో

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 6: ఉత్తమ పేరెంట్‌గా ఎంపికైన యశ్వంత్‌రావుకు మండల విద్యాశాఖాధికారి వెంకటేశం జ్ఞాపికతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఎల్లారెడ్డిలోని మండల విద్యా వనరుల కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఉత్తమ పేరెంట్‌గా ఎన్నికైన యశ్వంత్‌రావుకు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి తరఫున మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

వారం రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

మాట్లాడుతున్న డీఎల్పీవో శ్రీనివాస్

నిజాంసాగర్, ఫిబ్రవరి 6: ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలని డీఎల్పీవో శ్రీనివాస్ పంచాయతీ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. నిజాంసాగర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల పాటు రోడ్లపై గుంతలను పూడ్చడం, రోడ్లు, డ్రైనేజీలను శుభ్రం చేయడం, ముళ్ల పొదలను తొలగించడం, శిథిల భవనాలు కూల్చివేయడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను అందించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో నాగేశ్వర్, ఎంపీవో అబ్బాగౌడ్, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి..

రాజంపేట్, ఫిబ్రవరి 6 : మండలం ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలతో ఎంపీడీవో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాలకిషన్ ఆయన మాట్లాడుతూ.. బుధవారం నుంచి 14వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశుభ్రతతోపాటు నీటి సమస్య లేకుండా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రఘురాం, ఏపీవో భాస్కర్, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED
★హ్యాపి నైట్స్ బార్ & రెస్టారెంట్, గిరిరాజ్ కాలేజి ఎదురుగా దుబ్బ బైపాస్ రోడ్ నిజామాబాద్‌లో పనిచేయుటకు అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్, కుక్, వేయిటర్, సెల్స్‌మెన్, బౌనర్స్, డిజే ఆపరేటర్ & డ్రైవర్ కావలెను. సెల్: 9440645449.
NTZ-5934

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319433-All

CHANGE OF NAME
★I, CHINNPOORAM SAILOO, R/o. H.No. 7-81, Narsingpalli, Mugpal, Nizamabad-503 230, T.S. Changed My Name to CHINNAPURAM NADIPI SAILU, S/o. Chinnapuram Mallaiah.
NT-311078

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.